# గౌతమీగాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

గోదావరి దాటి అవతలి ఒడ్డుకు వెళ్ళడానికి ఒక లంక అడ్డం వుంది. దాని పొడుగు రెండు మైళ్ళు. కావడానికి రెండు మైళ్ళేగాని- గడవడానికి రెండు వందల మైళ్ళ పెట్టు. భారత సార్వభౌముడైనా సరే ఆవలి ఒడ్డుకు చేరాలంటే పంచ ఎగ్గట్టి నడవవలిసిందే. అయితే పరివారం పల్లకీ తెస్తాం మహారాజా అనవచ్చు. కాని ససేమిరా ఎక్కనంటాడు. ఒట్టేసి చెప్పగలను. ఆయనెక్కడు. ఎందుచేతనంటే ఆ లంక చూస్తూ నడవడం ఒక గొప్ప అనుభవం!

వరద రోజుల్లో బాగా ఒండ్రుపట్టి ఆ లంక ఒరగ బండుతుంది.

పచ్చని దోసతోటలు. ఎర్రని మిరప గుబురులు. ఆకుపచ్చని పుచ్చకాయల దొంతరలు- వారలంట నిండు చూలాం డ్రలా గెలలతో వంగిన ముక్క కొబ్బరి చెట్లు- నన్నే చూడమన్నట్టుంటాయి.

మఖపు దెయ్యాల్లాంటి సీమ చింత చెట్ల కొమ్మలకు తగులుకుని పల్లకీ ఇక వెళ్ళ ననడం అలా ఉంచుదాం.

ఎర్రని పట్టు చమ్లా, ఖరీదైన కోటూ, ముఖమల్ చెప్పులూ వేసుకుని ఒక బడా బాబు నావ దిగి పరివారం తెల్లబోతూండగా "నడవ నివ్వండి హాయిగా, వెధవ లాంఛనాలు, మీరూను" అని కసిరి పట్టు మడత ల్లాంటి ఇసకతిన్నెలమీద చకచకా నడిచి వెళ్లాడు.

ఆ లంకలో పెద్ద మోతుబరీ రైతు మా నారయ్యకాపు. కిర్రు చెప్పులు, బుంగ మీసాలు, ఒదులు తలపాగా- అతని రాజ లాంఛనాలు.

చూడడానికి ఎంత పులో, చేరడానికి అంత చెలి!

మా ముతాతలనాటి భూమి హరించి పోయింది పోగా మిగిలినవి రెండెకరాలు. తండ్రికీ, పినతండ్రికీ తగాదా లేకుండా చెరో ఎకరం తెగిపోయింది.

నారయ్యకాపుకి మా నాన్న పెదబాబు, చిన్నాన్న చినబాబు, చిన్నాన్న జులాయిగా తిరిగి తన ఎకరం అమ్మేతానంటే- బాధ పడుతూ నారయ్యకాపే కొన్నాడు. నాన్న ఎకరం బిక్కుబిక్కుమంటూమిగిలిఉంది.

"పెదబాబూ, నీ ఎకరం అమ్మకు! నీ శిస్తు పువ్వుల్లో పెట్టి పంపుతాను" అన్నా ఎర్ర మిరపపళ్ళల్లో పెట్టి పంపేవాడు.

ఒకసారి శిస్తు వసూలికి నాన్న నన్ను పంపాడు. నా కప్పుడు 21. చిన్న ఉద్యోగం చేస్తూ రాజమండ్రిలో ఉండడం వల్ల ఆ వసూలు నా పాల బడింది.

నావ దాటి వెళ్ళేసరికి సాయంత్రం అయింది నారయ్య ఇంటిదగ్గరే వున్నాడు. అంతకు ముందే వాళ్ళింట్లో పెళ్ళి జరిగింది గాబోలు. ఇంటి ముందు పెద్ద పందిరీ తోరణాలు అట్టహాసంగా వున్నాయి.

## లంకలో లేడిపిల్ల

"బుల్లి బాబొచ్చాడే!" అంటూ అల్లంత ముఖం చేసుకుని వాకిట్లో పెద్ద పట్టెమంచం వాల్చిచాకింటిదువ్వటీపరిచికూచోమన్నాడు.

కుశల ప్రశ్నలయాయి. భోజనం ప్రశ్న. లంకలో ఆరముగ్గిన నాలుగు జామి పళ్ళూ, నేయి, పంచదారలో మాగిన రెండు పూత చుట్టలు, పెద్ద వెండిగ్లాసుడు పాలూ 'ఎరా ఎంకన్నా' అనే ఒక ఉరుముతో ఒదిగి ఒదిగి ఎదటి బల్లమీదకు వచ్చి కూచున్నాయి.

నారయ్య కాపు పిలుపుకి ఇల్లు అదిరి పోతుంది. నాయకుడే నాయుడయ్యాడు. కాచేవాడే కాపు. నారయ్యకాపు ఆ వూరికి బొమిడికం లేని రాజు! 'బ్రాహ్మణీకం' చెడకుండా ఫలాహారం అయింది. గోదావరి జోలపాటతో నిద్ర పట్టేసింది.

తెల్లవారింది.

గోదావర్లో ఈది ఎన్నాళ్ళయిందో! పొలాల్లోంచి అడ్డపడి గోదావరిపాయవైపు నడుస్తున్నాను. ఏపుగా పెరిగిన జొన్న చేనుదగ్గర ఒక చక్కని లేడి చెంగలి మేస్తోంది.— నారయ్య పెంచుతున్నాడు. గాబోలు! ఎప్పుడూ చూడనేలేదు.

ఎంత అందమైన లేడి! చిన్న కొమ్ములు, పొడుగాటి కాళ్ళు, తళతళ మెరిసే పెద్ద కళ్ళు, ఆ కళ్ళ అందం చూస్తూ దానివెంట ఎన్నాళ్ళేనా తిరగొచ్చు.

"ఐణమాంస మబలాచ కోమలా"

మాంస మంటే కంపర మెత్తింది. రుచి మాట దేవు డెరుగు, మాంసం మాట తలుచుకుంటే- దాని జాలిజాలి చూపులు జ్ఞాపకంవచ్చి జలజల కన్నీళ్లు కారవా?

అయితే నాజూకైన కోమలితో జోడించి చెప్పడం మాత్రం వాడెవడో గొప్ప రసికుడై వుండాలనిపించింది.

ముద్దొచ్చి దాని వెన్ను నిమరబోయాను. చెంగున జొన్న చేలోకి దూకి పరిగెత్తింది. సందేహించకుండా వెంటపడ్డాను.

ఒక లేడి వెంటపడి నానా కష్టాలూ తెచ్చుకున్న వాడి కథ నిత్యం చదువుతూంటాను. అయినా జీవుని ఆంతర లక్షణం వేరు, వాడి పై చదువు వేరూ, కాబోలు! ఆ అందాన్ని ఒదులుకో లేక మనస్సు హృదయాన్ని అణచి పరుగెత్తుతోంది!

ఆ పసుగు జొన్నచేను కవతల ఒక పూరింటి ముందు తేలింది. పూరింటి ముందు చెట్టునీడలో పదహారేళ్ళ పిల్ల డొక్కనారచుడుతోంది.

అరే! లేడి ఏమయింది? పరుగెత్తి పరుగెత్తి ఆ లేడి ఈ 16 ఏళ్ళ ఆడపిల్లగా మారిపోయిందా?

అవే కళ్ళు! అదే చురుకు! అదేఒంటి నాజూకు మెత్తన! "సూరీకాంతం!"

ఎవరిదో పిలుపు! పిల్ల తలెత్తి చూసింది. కళ్ళు మరీ మెరిశాయి! ఎంతచక్కని పేరు! భాష ఏదైతేనేం?

లేడికి లేడీకి ఎంతదగ్గర!

సూరీకాంతానికి జార్జెట్ వోణీ, టెర్లిన్ పావడా లేవు. పని చేసిచేసి తలచెదిరిఉంది. చవకరకం పువ్వుల పరికిణీ, మాసిన ఆకుపచ్చ వోణీ, ఆమె నల్లని యౌవనం కోణార్క-శిలాశిల్పంలానిగనిగలాడుతోంది

నన్నుచూసి ముందు ఆశ్చర్యపడి వోణీ సవరించుకుని తెల్లగా నవ్వింది. పాల చినుకులు పేర్చినట్టున్న ఆ పళ్లు తళతళలాడాయి.

"ఎవరి కోసం" మెరిసే కళ్ళెత్తి అడిగింది.

ఔను "ఎవరి కోసం" ఆ మాట రెండు కొండలమధ్య లోయలోలా నా మనస్సులో ప్రతిధ్వనించింది.

ఔను, ఎవరి కోసం?

"నన్ను నిరంతరం దహించే సౌందర్య క్షుధ కోసం" అని చెప్పనా?

"దొరకని అందం కోసం పరిగెత్తే పిచ్చితనం" అని చెప్పనా?

"తోవ తప్పిన బాటసారి" నని చెప్పనా?

"లే.... డి.... కోసం" నోరుజారి అనేశాను.

పకపక నవ్వుతూ, "మీ ఎర్రిగాని అది దొరకదు బాబూ!" అని సూరీకాంతంపాకలోకి వెళ్ళిపోయింది.

"శివోహం, శివోహం"

గోదావరివైపు చరచరా నడిచి వెళ్ళిపోయాను.